సాక్షి సూర్యాపేట

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



నవోదయ ఫలితాలు విడుదల
జేఎన్‌వీలో 6, 9 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి.
- 8లో



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం
సిమెంట్ పరిశ్రమలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.
- 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-35 (మంగళవారం సా॥)
సహర్ 4-46 (బుధవారం ఉ॥)

రెండు సీట్లూ మనవే


మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో నల్లగొండ ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తదితరులు

- అందరం ఐక్యంగా పనిచేసి విజయం సాధించాలి
- మొన్నటి ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు పునరావృతం కారాదు
- మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు చెప్పుకోలేకపోయాం
- ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్‌ను వదిలిపెట్టం
- బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేటీఆర్

నల్లగొండ : 'ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో మనమే గెలవాలి. మొన్న ఎన్నికల్లో జరిగిన పొరపాట్లను సరిచేసుకుని, అందరం కష్టపడి పనిచేసి విజయం సాధించాలి' అని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం నల్లగొండలోని లక్ష్మీగార్డెన్‌లో జరిగిన నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో మనం చేసిన అభివృద్ధి చెప్పుకోలేకపోయామన్నారు. నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడలో ఎంతో అభివృద్ధి చేశాం. నల్లగొండ పట్టణ రూపురేఖలు మారాయి. సభలకు వచ్చిన జనాలను చూసి మనమే గెలుస్తామనుకున్నాం. కానీ, ఫలితాలు భిన్నంగా వచ్చాయన్నారు. కాళేశ్వరం నీరు సూర్యాపేట జిల్లాకు తెచ్చామని, ఫ్లోరోసిస్‌ను పూర్తిగా రూపుమాపామని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే జిల్లాలో మూడు మెడికల్ కళాశాలలు వచ్చాయని, అవి ఏమీ చెప్పుకోలేకపోయామని అన్నారు. ఏ ఊరికి వెళ్లినా రైతులు బాధపడుతున్నారని, కాంగ్రెస్ మోసపూరిత విధానాలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు.

మిల్లర్ల నుంచి మంత్రులు దోచుకున్నరు

రైస్‌మిల్లర్ల నుంచి జిల్లా మంత్రులు దోచుకున్నారని, రైతుల నుంచి మిల్లర్లు దోచుకున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆరోపించారు. పంటలు ఎండిపోతున్నా రైతులను పట్టించుకోలేదు. వారు మిల్లర్ల నుంచి దోచుకుంటే మిల్లర్లేమో ధర తగ్గించి రైతులను దోచుకున్నారని అన్నారు. ధాన్యం తక్కువ ధరకు కొంటున్నారని మిర్యాలగూడలో కోమటిరెడ్డికి రైతులు చెప్పగానే కలెక్టర్‌కు ఫోన్ చేసి మిల్లులు మూసివేయమని ఆదేశాలు ఇచ్చారని, అయితే ఆయన అక్కడ నుంచి రాగానే మిల్లర్లు మరో వంద తగ్గించి ధాన్యం కొనుగోలు చేశారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఖమ్మంకు నీరు పోతుంటేనే జిల్లా పంట పొలాలకు నీరందించామని, దద్దమ్మ మంత్రులు పాలేరు నీరు తీసుకుపోతున్నా 12 రోజులు పట్టించుకోలేదని విమర్శించారు. వంద రోజుల్లో ఏమి జరిగిందో ప్రజలందరూ గమనిస్తున్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీల పట్ల ప్రజలు అడగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కష్టపడి పని చేస్తే విజయం సాధిస్తాం. కేసీఆర్ చూపిన బాటలో నడుద్దాం అని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మోసపూరిత విధానాలను ప్రజలకు చెప్పాలని, ఐక్యంగా పనిచేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందామన్నారు. ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. వంద రోజుల్లో 200 మంది చనిపోయారన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నామంటూ విమర్శించారు.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి

2018 ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పది స్థానాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారని, అయినా ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారని అన్నారు. అదే తరహాలో మనం కూడా రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించాలి అని కార్యకర్తలకు సూచించారు. ప్రజల వద్దకు వెళ్లి రుణ మాఫీ వచ్చిందా అడగండి. నాలుగు నెలలు అయినా రుణ మాఫీ రాలేదు. బ్యాంకులు నోటీసులు పంపుతున్నాయి. ఈ విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. రైతు బంధు ఇస్తే కాంగ్రెస్‌కు ఓటేయండి. ఇవ్వకపోతే బీఆర్‌ఎస్‌కు ఓటేయండని అన్నారు. మళ్లీ కాంగ్రెస్‌కు ఓటేస్తే.. ప్రజలను పట్టించుకోరని వారు పని చేయాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టబోమన్నారు. మహిళలకు ఇస్తానన్న 2500 ఇవ్వాలి. ఆటో డ్రైవర్లకు రూ.10 వేలు ఇవ్వాలి. పొంకనాల పోతిరెడ్డి మాటలు విని ప్రజలు మోసపోయారని, ఇప్పుడే అర్థం చేసుకుంటున్నారని కేటీఆర్ అన్నారు.

పేదింటి పెద్దబిడ్డగా సేవచేస్తా

పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పేదింటి పెద్దబిడ్డగా సేవ చేస్తానని నల్లగొండ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. 'తెలంగాణ అమరవీరులు శ్రీకాంతాచారి, ఆదిరెడ్డి, యాదయ్యల సాక్షిగా ప్రమాణం చేస్తున్నా. నాయకున్ని కాదు మీకు సేవకుడిగా పనిచేస్తా' అని అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, గాదరి కిషోర్‌కుమార్, మల్లయ్యయాదవ్, నోముల భగత్, నాయకులు విజయేందర్‌రెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, చెరుకు సుధాకర్, కటికం సత్తయ్యగౌడ్, రవికుమార్, పంకజ్‌యాదవ్, రామచంద్రనాయక్, మందడి సైదిరెడ్డి, చకిలం అనిల్‌కుమార్, నిరంజన్ వలి తదితరులు పాల్గొన్నారు.

రైతులను పరామర్శించిన కేటీఆర్


రైతు మల్లయ్యతో మాట్లాడుతున్న కేటీఆర్

నల్లగొండ రూరల్: నల్లగొండ మండలం ముశంపల్లిలో గన్నెబోయిన మల్లయ్య యాదవ్, బోర్ల రాంరెడ్డి నివాసాలకు వెళ్లి కేటీఆర్ వారితో కొద్దిసేపు మాట్లాడారు. మొదట మల్లయ్య, ఆ తర్వాత రాంరెడ్డి ఇంటికి వెళ్లి వారితో ముచ్చటించారు.

కేటీఆర్ : మల్లన్నా బాగున్నవా
మల్లయ్య : ఏం బాగయ్యా.. అంతా ఆగమాగం ఉంది.
కేటీఆర్ : ఎంత మంది పిల్లలు
మల్లయ్య.. ముగ్గురు కుమార్తెలు వారి పెండ్లి చేసిన. ఒక కుమారుడు సైదులు 2015లో గుండెపోటు వచ్చి చనిపోయిండు.
కేటీఆర్ : కుమారునికి పిల్లలు ఉన్నారా
మల్లయ్య : ఒక కొడుకు, బిడ్డ ఉంది (కుమారుని ఫొటో చూపిస్తూ చెప్పాడు)
కేటీఆర్ : ఎన్ని ఎకరాల భూమి ఉంది.. ఏం పంట వేశావు?
మల్లయ్య : 11 ఎకరాలు ఉంటే అప్పుడు కరువు వచ్చినప్పుడు 2 ఎకరాలు అమ్మిన ఇప్పుడు 5 ఎకరాల్లో బత్తాయి తోట ఉంది. 3 ఎకరాల్లో పొలం ఉంది. కంకి గట్టి పడే సమయంలో నీళ్ల తిప్పలు వచ్చాయి. పొలం వదిలేసి తోటకు నీళ్లు పెడుతున్న. 2 బోర్లు వేసినా నీరు పడలే.
కేటీఆర్ : ఎందుకు సమస్య వచ్చింది?
మల్లయ్య : కేసీఆర్ పాలనలో చెరువు నిండా నీళ్లు ఉండే.. ఇప్పుడు నీళ్లు ఇవ్వక చెరువు ఎండింది. అందులోనే బోర్లు వేస్తున్నారు.
కేటీఆర్ : నీళ్లు ఇచ్చి చెరువు నింపితే ఇలాంటి పరిస్థితి వచ్చేదా?
మల్లయ్య : చెరువులు నింపితే రైతుల పంటలు బాగా పండేవి. మల్లా ఎప్పటిలాగానే ఉంది. కేసీఆర్ పాలనప్పుడు బలంగా వానలు పడి పంటలు బాగా పండినయి.
కేటీఆర్ : ధైర్యంగా ఉండూ మళ్లీ మన సారె వస్తడు
మల్లయ్య : వస్తడు.. కేసీఆర్ వస్తనే వానలు పడ్తయి.

రాంరెడ్డి ఇంటి వద్ద..
కేటీఆర్ : రామన్న బాగున్నవా
రాంరెడ్డి : బాగున్నా రామన్నా
కేటీఆర్ : నీళ్ల సమస్య ఉందా
రాంరెడ్డి : ఇగో ఇంట్లో కూడా బోరు వేసినా చూడు.. నీళ్లు రాలె
కేటీఆర్ : ఎందుకు?
రాంరెడ్డి : చెరువు నింపితే నీళ్ల సమస్య వచ్చేది కాదు. ఎన్ని బోర్లు వేసినా నీళ్లు రావడం లేదు. మళ్లీ పాత రోజులే వచ్చాయి.


బోర్ల రాంరెడ్డితో మాట్లాడుతున్న కేటీఆర్

న్యూస్‌రీల్

ఒకేషనల్ పరీక్షకు 1,147 మంది హాజరు

సూర్యాపేటటౌన్ : పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా సోమవారం ఒకేషనల్ విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 13 పరీక్ష కేంద్రాల్లో 1,168 మంది విద్యార్థులకు గాను 1,147 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈఓ అశోక్ పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

తుంగతుర్తి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని అదనపు కలెక్టర్ బీఎస్ లత సూచించారు. సోమవారం తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగుపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మోహన్‌బాబుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ- గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2183 మద్దతు ధర నిర్ణయించిందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సిబ్బందికి సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని ఆదేశించారు. తుంగతుర్తి, వెంపటి, రామన్నగూడెంతండా, గొట్టిపర్తి గ్రామాల్లో కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చామల రమణారెడ్డి, ఎంపీడీఓ భీంసింగ్ నాయక్, ఏపీఓ నర్సయ్య, ఏఓ బాలక్రిష్ణ, ఏఈఓ ప్రసన్న, సీసీలు యాదగిరి, నర్సింగ్ నాయక్, నర్మద పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నరేష్


నియామక పత్రం అందుకుంటున్న నరేష్

భానుపురి (సూర్యాపేట) : ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేటకు చెందిన కళ్లేపల్లి నరేష్ నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని చైతన్యపురిలో గల కార్యాలయంలో రాష్ట్ర ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మురారీ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిబాబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాజు, మీసాల ప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడమ కాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్: సాగర్ ఎడమ కాల్వకు సోమవారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. తాగునీటికోసం నీటిని విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. వెయ్యి క్యూసెక్కులతో మొదలై 2,500 క్యూసెక్కుల మేర నీటిని విడుదల చేస్తున్నారు. నీటిని వృథా చేయకుండా కేవలం తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని అధికారులు కోరారు. అయితే సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా ప్రస్తుతం నీటిమట్టం 513.40 అడుగులు (137.5158 టీఎంసీలు) ఉంది.

కేసీఆర్‌ది వైరాగ్య యాత్ర

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టింది పొలం బాట కాదని, వైరాగ్య యాత్ర అని డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో అభివర్ణించారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు బేడీలు వేయడం, వరి వేస్తే ఉరే అన్న కేసీఆర్ ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుల గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని పేర్కొన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయి మానేరు ఎండిపోవడంతో సూర్యాపేట జిల్లాలో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాడని తెలిపారు. అధికారం కోల్పోయి పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు పరారవుతున్న పరిస్థితుల్లో తట్టుకోలేకపోతున్నారని, యాత్రల పేరుతో రైతులను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు.

ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

- జిల్లా ఎన్నికల అధికారి వెంకటరావు

సూర్యాపేటటౌన్ : ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు సూచించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట నియోజకవర్గానికి సంబంధించిన పీఓ, ఏపీఓలకు సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఈవీఎంల పనితీరుపై సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఈవీఎంల పని తీరు, బాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల కనెక్షన్లు, వాటి పని తీరు, మరమ్మతులకు గురైతే తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లో పరిధిలోని 1,416 మంది పీఓలు, ఏపీఓలకు గాను మొదటి రోజు 1,188 మంది హాజరైనట్లు తెలిపారు. తొలి రోజు హాజరు కాని 228 మంది సిబ్బంది రెండో రోజు తప్పక రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవ్, తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, డీఏఓ జి. శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వెంకటరావు

తాగు నీటి సమస్య రాకుండా చూడాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.వెంకటరావు ఆదేశించారు. తాగునీటి ఎద్దడి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకొని నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్ నుంచి 336 హాబిటేషన్లు, 193 జీపీలకు ఇబ్బందులు లేకుండా పెన్‌పహాడ్ మండలం నాగులపహాడ్, అన్నారం, నేరేడుచర్లలోని దాచారం, ముకుందాపురం, కల్లూరు, ఫతేపురం, గరిడేపల్లిలోని మర్రికుంట, పొనుగోడు లాచ్యతండా, వెలిదండ, చిలుకూరులోని ఆచర్లగూడెం, పోలేనిగూడెం, మునగాల లోని బరాఖత్‌గూడెం, నడిగూడెం మండలం రామాపురం, చాకిరాల, సిరిపురం, రామచంద్రపురం గ్రామాల ద్వారా 60 కిలో మీటర్ల పొడవున కెనాల్ ద్వారా పాలేరుకు నీటిని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రియాంక, బీఎస్.లత, ఆర్‌డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, జిల్లా అధికారులు, నీటిపారుదల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యం చేరుకోవాలి


విద్యార్థులతో మెడికల్ కళాశాల బోధన సిబ్బంది

- జిల్లా వైద్యాధికారి కోటాచలం

సూర్యాపేట: జూనియర్ వైద్యులు వైద్యరంగంలో నైపుణ్యాలు నేర్చుకుని ఉన్నత లక్ష్యం చేరుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో 2019 బ్యాచ్ విద్యార్థులకు నిర్వహించిన ఇండక్షన్ (ప్రేరణ) కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయలత, సూపరింటెండెంట్ డాక్టర్ అనునయి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎల్.రమేష్, డాక్టర్ గిరిధర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేట క్రైం: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్నే పోలీస్ సైబర్ వారియర్స్‌కు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్ హెల్ప్ లైన్ నంబర్లు, మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ అందించి మాట్లాడారు. సైబర్ మోసానికి గురైన వారు ఆన్‌లైన్ ద్వారా, 1930 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు నమోదు చేసుకున్నాక వాటి స్థితిగతులు తెలుసుకునేందుకు టోల్ ఫ్రీ 1930 కి ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీని వల్ల ఫిర్యాదులు చేసుకునే వారికి ఆటంకం కలుగుతోందని అందువల్ల సైబర్ వారియర్స్ కు నూతన హెల్ప్ లైన్ నంబర్స్, మొబైల్స్ అందించామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్ మీనా, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


సైబర్ వారియర్స్‌కు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

జిల్లాలో ఈనెల 30 వరకు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్-1861 అమలులో ఉంటుందని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు నిర్వహించకూడదని పేర్కొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ రాహుల్‌హెగ్డే ఫిర్యాదులు స్వీకరించి బాధితులకు భరోసా కల్పించారు.

బోధన సిబ్బంది నియామకానికి 6న ఇంటర్వ్యూలు

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో 4 ప్రొఫెసర్ పోస్టులు, 19 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 10 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు, 17 సీనియర్ రెసిడెంట్ పోస్టులు, 14ట్యూటర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించనున్నట్లు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటి నియామకానికి ఈనెల 6న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు అదే రోజు ఉదయం 11 గంటల వరకు దరఖాస్తులను సమర్పించాలని పేర్కొన్నారు.

ఓటు ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలి

సూర్యాపేటటౌన్ : ప్రతి ఒక్కరూ ఓటు ఆవశ్యకతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, విద్యాశాఖ అధికారి కె.అశోక్ కోరారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి సద్దల చెరువు వరకు 5 కే రన్‌ను నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజా స్వామ్యాన్ని కాపాడాలని, ప్రలోభాలకు లొంగ వద్దని, నిర్భయంగా ఓటు వేయాలని నినాదాలు చేశారు. శంకర్ విలాస్ సెంటర్ వద్ద మానవ హారం ఏర్పాటు చేసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

'నో చెక్' పోస్ట్


కుంటపల్లి చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై లేని అధికారులు, చెక్‌పోస్టు దాటుతున్న వాహనాలు


వెలిశాల చెక్‌పోస్టు వద్ద రోడ్డుపై లేని అధికారులు, చెక్‌పోస్టు దాటుతున్న వాహనాలు

- జిల్లాలో చెక్‌పోస్టుల వద్ద నామమాత్రపు తనిఖీలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్‌ఎస్‌టీ, పోలీస్ బృందాలు
- కలెక్టరేట్ మానిటరింగ్ సిస్టమ్‌లో కనబడుతున్న దృశ్యాలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నామమాత్రంగానే కొనసాగుతున్నాయి. ప్రతివాహనాన్ని, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయాల్సిన టీములు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఎన్నికల్లో ఓటర్లను మభ్యపెట్టడానికి డబ్బులు, మద్యం పంపిణీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ తరుణంలో జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి కలెక్టర్ ఎస్. వెంకటరావు, ఎస్పీ రాహుల్‌హెగ్డేలు నిరంతరం అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి సమీక్షిస్తున్నారు. డబ్బు, మద్యం రవాణాను అరికట్టేందుకు జిల్లాలో 6 అంతర్‌రాష్ట్ర, 6 జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు, ప్రత్యేక సిబ్బంది 24 గంటల పాటు తనిఖీలు చేపట్టేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి వాహనాన్ని పారదర్శకంగా తనిఖీ చేస్తున్నారా? లేదా అని చూసేందుకు ప్రతి చెక్‌పోస్టు వద్ద రెండు సీసీ కేంద్రాలను ఏర్పాటు చేసి..కలెక్టరేట్ నుంచి పర్యవేక్షించడానికి అనుసంధానం చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో ఉంటూ చెక్ పోస్టుల వద్ద సాగుతున్న తనిఖీలను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా మానిటరింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయించారు. ఈ విధానంతో తనిఖీలు పక్కాగా నిర్వహించే అవకాశం ఉంటుందని భావించారు. కానీ అనుకున్న లక్ష్యం నేరవేరుతున్నట్లు కనబడటం లేదు.

మొక్కుబడిగా తనిఖీలు

పార్లమెంట్ ఎన్నికలను పాదర్శకంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. తనిఖీలు నిర్వహించడానికి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్‌ఎస్‌టీ), స్టాటిస్టికల్ సర్వేలెన్స్‌టీమ్ (ఎస్‌ఎస్‌టీ), వీడియో సర్వేలెన్స్ టీమ్ (వీఎస్‌టీ) ఎంసీసీ, అకౌంటింగ్, వీడియో వ్యూయింగ్ (వీవీటీ) టీములు ఏర్పాటు చేశారు. నగదు, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేలా ఈ టీములతో పాటు పోలీస్, కేంద్ర బలగాలను రంగంలోకి దింపారు. స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీములు, పోలీసులు, కేంద్ర బలగాలు కలిసి చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని, అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయాలి. ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్‌ఎస్‌టీ) బృందాలు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో నిరంతరం తనిఖీలు చేయడంతో పాటు కోడ్ ఉలంఘనలు ఉంటే పర్యవేక్షించాలి. కానీ ఈ టీములు నామమాత్రంగానే విధులు నిర్వహిస్తున్నాయి. చెక్‌పోస్టుల వద్ద టెంట్‌లు వేసుకొని రోడ్డుపైకి రాకుండా తాపీగా సేదతీరుతున్నారనే విమర్శలు ఉన్నాయి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సిస్టమ్ ద్వారా చూస్తే వాస్తవ పరిస్థితులు అర్థమవుతున్నాయి.

మెమోలు జారీ చేసినా రాని మార్పు

ఎస్‌ఎస్‌టీ (స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీమ్)లో కోదాడ, తుంగతుర్తి నియోజకవర్గాల్లో విధులు కేటాయించిన ఉద్యోగులు హాజరుకాకపోవడంతో గత నెల 29న కలెక్టర్ మెమోలు జారీ చేశారు. అయినా అధికారుల తీరులో మార్పు రాలేదు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగిన యువతి

● ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి


పావని (ఫైల్)

భువనగిరి క్రైం: పురుగుల మందు తాగిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. భువనగిరి పట్టణ సీఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మోటకొండూర్ మండలం నాంచారిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కదిరేణిగూడేనికి చెందిన రాంపల్లి గోపాల్, పద్మ దంపతులు తమ కుమార్తె పావని(24), కుమారుడితో కలిసి భువనగిరి పట్టణంలోని కుమ్మరివాడలో నివాసముంటున్నారు. నార్కట్‌పల్లి మండలం గోపలాయిపల్లి గ్రామానికి చెందిన వారి బంధువైన మండల శ్రవణ్, పావని గత కొన్ని నెలలుగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల పావని కుటుంబ సభ్యులు వెళ్లి శ్రవణ్ కుటుంబ సభ్యులతో పెళ్లి విషయమై ప్రస్తావించారు. కాగా తన అమ్మ, అన్న వివాహానికి అంగీకరించటడం లేదని శ్రవణ్ పావనికి చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన పావని మార్చి 29న ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా పావని స్థానిక సాయి బీడీ కార్ఖానాలో పనిచేస్తూ ఎంబీఏ చదువుతోంది. నెల క్రితం కూడా ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఇంట్లోని వారు సర్దిచెప్పినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నకిరేకల్: నకిరేకల్ శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ శివారులోని పద్మానగర్ జంక్షన్ సమీపంలో నగేష్ హోటల్‌కు ఎదురుగా విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నకిరేకల్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, అతడి గురించి ఆచూకీ తెలిసిన వారు 8712670145, 8008352919 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ గోపికృష్ణ సూచించారు.

‘సంస్థాన్’ ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

● 13మంది సభ్యులకు గాను 8మంది హాజరు
● కోరం లేకపోవడంతో అవిశ్వాసం వీగినట్లు ప్రకటించిన ఆర్డీఓ
● ఆర్డీఓ తీరుకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ సభ్యుల నిరసన


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యులు

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమాదేవిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. గత ఏడాది జూలై 8న ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని ఎంపీటీసీ సభ్యులు తీర్మానం చేశారు. కాగా ఎంపీపీ కోర్టు నుంచి స్టే తెచ్చుకోగా.. స్టే గడువు ముగియడంతో సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అవిశ్వాసంపై ఆర్డీఓ సమక్షంలో ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 13మంది ఎంపీటీసీ సభ్యులకు గాను ఒకరు మృతిచెందగా.. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 8మంది ఎంపీటీసీ సభ్యులు అంగోతు రాజు(వైస్ ఎంపీపీ), దోనూరి శ్రావణి, శివరాత్రి కవిత, గడ్డం రాములమ్మ, బానోతు రజిత, దోటి జంగయ్య, ఈసం యాదయ్య, నర్రి పావని హాజరయ్యారు. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 13మంది సభ్యులకు గాను 9మంది సభ్యులు(2/3వ వంతు) హాజరు కావాల్సి ఉండగా.. 8మంది సభ్యులు మాత్రమే హాజరుకావడంతో అవిశ్వాసం వీగిపోయిందని ఆర్డీఓ ప్రకటించారు. ఓటింగ్ సమయంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం పరిసరాల్లోని షాపులను మూసివేశారు.

ఆర్డీఓకు వ్యతిరేకంగా నిరసన

ఓటింగ్ సమయంలో అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఆర్డీఓ వ్యవహరించారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. మొత్తం 13మంది ఎంపీటీసీ సభ్యులలో ఒక ఎంపీటీసీ సభ్యుడు మృతి చెందాడని, మృతి చెందిన సభ్యుడికి ఓటింగ్ నోటీసు అందజేశారా అని ఆర్డీఓను ప్రశ్నించారు. 12మంది సభ్యులకు గాను 2/3వ వంతు ప్రకారం 8మంది సభ్యులతో ఓటింగ్ నిర్వహించాల్సి ఉన్నా.. ఆర్డీఓ అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించాడని ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్డీఓ వెళ్తుండగా ఆయన కారుకు అడ్డంగా బైఠాయించారు. పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులు, ఎంపీటీసీ సభ్యులను పక్కకు తీసుకెళ్లి ఆర్డీఓను పంపించి ఎంపీడీఓ కార్యాలయం గేటు వేయడంతో గేటు బయట ధర్నా చేశారు. బీఆర్‌ఎస్ ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ ప్రమోదకుమార్‌ను అవిశ్వాస తీర్మానం ఓటింగ్ ప్రతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చండూరు ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

చండూరు: చండూరు మండల పరిషత్ కార్యాలయంలో కోర్టు ఆదేశాల మేరకు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సోమవారం ఎంపీపీ పల్లె కళ్యాణిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేసి ఓటింగ్ నిర్వహించారు. మొత్తం పది మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 9మంది హాజరయ్యారు. ఎంపీపీ పల్లె కళ్యాణి గైర్హాజరయ్యారు. అవిశ్వాసానికి మద్దతుగా 9మంది ఎంపీటీసీ సభ్యులు చేతులెత్తారు. ఇందులో ఆరుగురు బీఆర్‌ఎస్, ఎంపీటీసీ సభ్యులు కాగా ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. త్వరలో వైస్ ఎంపీపీకి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ నెల 4వ తేదీన వైస్ ఎంపీపీ అవ్వారి గీత అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం జరగనుంది. కాగా ఎంపీపీ పల్లె కళ్యాణి శుక్రవారం సాయంత్రమే జెడ్పీ సీఈఓని కలిసి తన రాజీనామా లేఖను అందజేశారు. రాజీనామాకు ఆమోదం లభించడంతో అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో సోమవారం యథా విధిగా చండూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్డీఓ అవిశ్వాసంపై ఓటింగ్ నిర్వహించారు.

నేరేడుగొమ్ములోనూ...


అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తుతున్న ఎంపీటీసీ సభ్యులు

చందంపేట: నేరేడుగొమ్ము మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీపై సోమవారం ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం నెగ్గింది. ఆరుగురు ఎంపీటీసీలు సభ్యులు ఉండగా. నలుగురు ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి హాజరై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో ఎంపీపీ, వైసీ ఎంపీపీపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గిందని దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీటీసీ సభ్యులు యుగంధర్‌రెడ్డి, బిక్కునాయక్, రమేష్, సరోజ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు అంతర్జాతీయ అవార్డులు


అవార్డులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్, చిలుకూరు: చిలుకూరు మండల పరిధిలో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ గురుకుల జూనియర్ కళాశాల –హుజూర్‌నగర్ విద్యార్థులు ఆర్ట్ విభాగంలో అంతర్జాతీయ అవార్డులు పొందినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి తెలిపారు. అవార్డులు పొందిన విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ముంబైకి చెందిన రంగోత్సవం సెలబ్రేషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో ప్రపంచం వ్యాప్తంగా వివిధ ఆర్ట్ విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కలరింగ్, టాటూ మేకింగ్, స్కెచ్, గ్రీటింగ్ కార్డు మేకింగ్, ఫొటోగ్రఫీ, కార్టూన్ మేకింగ్, హ్యాండ్ రైటింగ్ తదితర విభాగాల్లో 21 మంది విద్యార్థులకు 21 అంతర్జాతీయ అవార్డులు వచ్చినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా తనకు వరల్డ్ వైడ్ హైయెస్ట్ పెర్ఫామెన్స్ అవార్డు, ఆర్ట్ టీచర్ డాక్టర్ నాగజానుకు వరల్డ్ ఫేమస్ ఆర్టిస్ట్ సెల్వడోర్ డాలి అవార్డు లభించినట్లు తెలిపారు. ఎక్కువ అవార్డులు రావడంతో పాఠశాలకు సైతం ఆర్ట్ విభాగంలో అంతర్జాతీయ గ్లోబల్ స్కూల్ అవార్డు లభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నందనాయక్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, రాంబాబు, చిరంజీవి, రమేష్, సురేందర్‌రెడ్డి, యాస్మిన్, ప్రమీల, రాణి, భగీరథ, శ్రీనివాస్, సైదులు, నాగేశ్వరరావు, రాజేష్, వినోద్, సైదులు, అశోక్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం ‘ఉపాధి హామీ’కి నిధులు తగ్గిస్తోంది

● అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్



మాట్లాడుతున్న బి. వెంకట్

చిట్యాల: జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకానికి 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో 4శాతం నిధులు కేటాయిస్తే, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం 1.5 శాతం నిధులు మాత్రమే కేటాయిస్తూ కూలీల సంక్షేమాన్ని విస్మరిస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ ఆరోపించారు. చిట్యాల పట్టణంలో సోమవారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మరోమారు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేస్తారన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీజేపీని గద్దె దించేందుకు గాను మంగళవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. వ్యవసాయ కార్మికుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కూలీలకు రోజుకు రూ.600, రెండు వందల రోజుల పనిదినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలు పోటీలో లేని చోట కాంగ్రెస్ పార్టీకి వ్యవసాయ కార్మిక సంఘం మద్దతు నిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య, కార్యదర్శి నారి అయిలయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కత్తుల లింగస్వామి, రవినాయక్, జిట్ట సరోజన, జిల్లా నాయకులు చింతపల్లి లూర్థు మారయ్య, బొడ్డు బాలసైదులు, కల్లూరి కుమారస్వామి, అలివేలు, నాగరాజు, హనుమంతు, అంజనేయులు, అంజయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


పద్మారెడ్డి (ఫైల్)

భువనగిరి క్రైం: తండ్రీకుమారులు దాడి చేయడంతో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. వివరాలు.. భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామానికి ఎలిమినేటి పద్మారెడ్డి(60) వ్యవసాయ పొలంలో అదే గ్రామవాసి మేడబోయిన సత్తయ్యకు చెందిన గేదెలు మేస్తుండగా.. పద్మారెడ్డి వారించాడు. దీంతో సత్తయ్యతో పాటు అతడి కుమారులు బాలమల్లేశ్, గోపికృష్ణ కలిసి పద్మారెడ్డితో పాటు అతడి భార్య కమలమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డిపై దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన పద్మారెడ్డి హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. భువనగిరి ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. కాగా పద్మారెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడబోయిన సత్తయ్య, అతడి కుమారులు బాలమల్లేశ్, గోపికృష్ణను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేయగా జైలులో ఉన్నారు.


సత్తయ్య ఇంట్లో పద్మారెడ్డి మృతదేహాన్ని ఉంచిన బంధువులు

మృతదేహంతో ధర్నా..

పద్మారెడ్డి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు, బంధువులు మేడబోయిన సత్తయ్య ఇంట్లో ఉంచి నిరసన తెలిపారు. మృతదేహాన్ని అక్కడే ఖననం చేస్తామని బంధువులు హెచ్చరించడంతో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ వారిని నచ్చజెప్పడంతో ధర్నాను విరమించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

తిరుమలగిరి మార్కెట్‌కు 20,485 బస్తాల ధాన్యం రాక

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 20,485 బస్తాల ధాన్యం వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ వెల్లడించారు. గరిష్టంగా క్వింటాకు రూ.1,997, కనిష్టంగా రూ.1,620 ధర పలికినట్లు తెలిపారు. అత్యధికంగా ధాన్యం వచ్చిన కారణంగా కాంటాలు ఆలస్యమవుతుండటంతో మార్కెట్ యార్డుకు మంగళవారం సెలవు ప్రకటించినట్లు చెప్పారు. తిరిగి 3వ తేదీన మార్కెట్ యార్డు యథావిధిగా పనిచేస్తుందని తెలిపారు.


తిరుమలగిరి మార్కెట్‌లో ధాన్యం రాశులు

యాదాద్రీశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి


స్వామి సన్నిధిలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీతో పాటు వారి కుటుంబ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మనుమడికి తలనీలాలు తీయించారు. యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిని ఘనంగా సన్మానించారు.

భక్తుల సౌకర్యార్థం వాటర్ ఫిల్టర్ల ఏర్పాటు..

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి వచ్చే భక్తులకు వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఒక్కొక్కటిగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొండ పైన బస్టాండ్, దీపారాధన సమీపంలో దాతల సహకారంతో వాటర్ ఫిల్టర్ల ద్వారా భక్తులకు తాగునీటిని అందిస్తున్నారు. సోమవారం నుంచి ఆలయ పరిసరాల్లోని కూడా పలు ప్రాంతాల్లో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా మాడ వీధుల్లో తాత్కాలిక చలువ పందిళ్లు, జర్మన్ టెంట్‌ను ఇప్పటికే ఏర్పాటు చేశారు.

పోలీసుల ముమ్మర తనిఖీలు

● నగదు, బంగారం, వెండి స్వాధీనం


బంగారం, వెండిని ఎన్నికల అధికారులకు అప్పగిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ, ఎస్‌ఐలు

పెద్దవూర: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పెద్దవూర మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కొండమల్లేపల్లి వైపు నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.3లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పి. వీరబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడకు చెందిన చందాక తాతారావు వద్ద రూ.1.50లక్షలు, కృష్ణా జిల్లాకు చెందిన ఎర్రగడ్డ నవీన్ వద్ద రూ.50వేలు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొండల దుర్గారావు వద్ద నుంచి రూ.లక్ష తీసుకెళ్తుండగా.. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్ చెక్‌పోస్టు వద్ద గుంటూరు జిల్లా రెంటచింతలపల్లి మండలం తుమ్మకోట గ్రామానికి చెందిన సైదారావు నుంచి రూ1.40లక్షలు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడేనికి ఎల్లబోయిన నాగరాజు నుంచి రూ.99వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ యాదయ్య తెలిపారు. పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో డీటీఓ నల్లగొండకు నగదును అప్పగించినట్లు పేర్కొన్నారు.

కట్టంగూర్ హైవేపై రూ.2లక్షలు..

కట్టంగూర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన కురుమంచి హనుమంతరావు హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో వెళ్తుండగా.. కట్టంగూర్ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2లక్షలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొమ్మును జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు ఎస్‌ఐ ఎన్. శ్రీను తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్‌ఐ అఫ్జల్ అలీ, పోలీస్ సిబ్బంది రామలింగయ్య, సత్యనారాయణ, మల్లేష్, నరహరి, సైదులు పాల్గొన్నారు.

టేకుమట్లలో బంగారం, వెండి పట్టివేత..

సూర్యాపేట రూరల్: మండలంలోని టేకుమట్ల గ్రామం వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న బంగారు, వెండిని సూర్యాపేట రూరల్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఉదయం సూర్యాపేట రూరల్ సీఐ వై. సురేందర్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ బాలునాయక్, సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న బొలేరో వాహనంలో రూ.76.39లక్షల విలువైన 1,135 గ్రాముల బంగారం, రూ.13.55లక్షల విలువైన 17కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారం, వెండిని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు సీఐ సురేందర్‌రెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన కార్యదర్శి


విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి సైదులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను సోమవారం బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శి సైదులు సందర్శించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. పాఠ్యాంశాల గురించి విద్యార్థులను అడగడంతో పాటు.. హాజరు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. డిగ్రీ కళాశాల విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఆయన ఇదే పాఠశాలలో 1987లో 8వ తరగతిలో చేరి 1990లో పదో తరగతి ఉత్తీర్ణుడయ్యారు. తాను చదువుకున్న పాఠశాలను బీసీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా సందర్శించడం చాలా ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట నల్లగొండ ఆర్‌సీఓ షకీనా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రచారి, పాఠశాల ప్రిన్సిపాల్ రజనీకాంత్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న చినజీయర్‌స్వామి తదితరులు

మేళ్లచెర్వు: మండలంలోని మహా సిమెంట్ పరిశ్రమలో గల శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని త్రిదండి చినజీయర్‌స్వామి, అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. స్వామివారి కల్యాణం, బ్రహ్మోత్సవాల ద్వారా భక్తులకు దైవచింతన పెరుగుతుందని తెలిపారు. అనంతరం నూతన సంవత్సర పంచాంగ క్యాలెండర్ ఆవిష్కరించి భక్తులకు మంగళశాసనములు అందజేశారు. ఈ కల్యాణోత్సవంలో మహా సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు జూపల్లి రామేశ్వరరావు, మునగాల రామ్మోహన్‌రావు–అరుణ దంపతులు, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు–అనురాధ దంపతులు, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి. రాజగోపాల్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ హిమబిందు, పరిశ్రమ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

వలిగొండ: మండలంలోని టేకులసోమారం సమీపంలో రైల్వే ట్రాక్‌పై సోమవారం ఓ వ్యక్తి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న భువనగిరి రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఘటనా స్థలంలో దొరికిన ఆధారాల మేరకు మృతుడు భువనగిరి మండలం వీరవెల్లి కమ్మగూడేనికి చెందిన చిన్నబత్తుల లాజర్(42)గా గుర్తించినట్లు రైల్వే ఎస్‌ఐ వెంకన్న తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి, తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి గాను నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ కేవీ నాగభూషణం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్షను జనవరి 20వ తేదీన, తొమ్మిదో ప్రవేశ పరీక్షను ఫిబ్రవరి 10వ తేదీన నిర్వహించినట్లు తెలిపారు. ఆరో తరగతికి 79మంది విద్యార్థులు తాత్కాలికంగా ఎంపికయ్యారని, తొమ్మిదో తరగతికి ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి అడ్మిషన్ ఫారాలు డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా వివరాలు నింపి అవసరమైన అన్ని సర్టిఫికెట్లను సమకూర్చుకుని ఈ నెల 11, 12 తేదీల్లో చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో పాఠశాల పనివేళల సమయంలో డాక్యుమెంట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు.

ఆరో తరగతికి ఎంపికైన విద్యార్థులు వీరే..

యరమాల యజ్ఞశ్రీ చంద్రహాస్(కే3479330), గూడెపు జాన్సన్ (జే3480803), చింతల హృతిక్ యాదవ్ (జే3480952), ఈదం రిత్విక్(జే3481162), రమావత్ అనిల్(ఎల్3481291), చెన్నబోయిన సిద్దార్థ(జే3481317), బోడ ఆరాధ్య(పీ3481780), కట్టెబోయిన కావ్యశ్రీ(ఎఫ్3478776), నారగని వర్షిత్ (జే3479060), నల్లమెట్టి యోగవర్థిని(ఎన్3481006), కాటం నిహారిక (ఎన్3481029), నాంపల్లి దేవర్షిని (ఎన్3481106), పేర్ల సామిత్ (కే3478265), సహర్ష్ గోపాల్ దాస్(సీ3479480), ముద్దం జస్వంత్ (కే3479697), అనంత్ జీవన్ (బీ3478779), తీగల సాత్విక్‌రెడ్డి (ఐ3480098), తెనాలి వరుణ్‌రెడ్డి(ఐ3482246), రమావత్ హర్షిత (పీ3478467), భూక్యా రిత్విక(పీ3481564), గండికోట యశ్వంత్(జే3477697), గుర్రం మణికంత (జే3477884), కన్నెమోని సహస్ర(ఎన్3477949), కుంభం దిగ్నేష్‌రెడ్డి (ఐ3478190), ఉరుపక్క శ్రీచరణ్ (కే3478206), గంట భానుప్రసాద్ (జే3478305), ముడావత్ శశిధర్ (ఎల్3478436), బోనోతు లక్ష్మీకాంత్‌నాయక్ (ఎల్3478771), కాల్వ లక్ష్మీయశ్వంత్(జే3478920), ఉన్నం ఉద్విత్ (ఐ3479196), పేలి జశ్వంత్(జే3479338), మేకపోతుల రాంచరణ్(జే3479405), జంగం చేతన్(కే3479458), బొడ్డు సహస్ర(ఎన్3479761), చెర్కుపల్లి వర్షిత్ (జే3479981), గొరోజు శివమణి (ఎన్3480078), దేవులపల్లి సాత్విక్ తేజ (జే3480189), వలిశెట్టి సాత్విక (ఎన్3480244), చింత హర్షతేజ(కే3480366), బానోత్ పార్థు (ఎల్3480485), వాంకునావత్ సాయికుమార్ (ఎల్3481247), బాణావత్ నిఖిల్ (ఎల్3481340), బుర్ర జతిన్‌యాదవ్(జే3481457), బోడ రిషికేష్ (ఎల్3481683), భూక్య ధనుష్(ఎల్3481701), ఇటుకూరి వరుణ్‌తేజ్ (జే3482148), గుండగని శ్రీరాం(జే3482195), కనుగుల మోక్ష (ఎన్3478428), కర్నాటి తమన్(జే3478490), కన్నెబోయిన లిఖిత (ఎన్3478986), కన్నూరి సాయి కౌషిక్ (జే3479009), ఏసు వశిష్ట గౌతం (జే3479010), షేక్ రహీం షరీఫ్(జే3479014), అల్వాల జశ్వంత్ (జే3479144), పల్లపు తీర్థన(ఎన్3479160), కొమ్మరాజు రోహిత్ (జే3479261), బి. రేవంత్(జే3480977), బిల్ల కౌషిక్(జే3480993), గంగుల జ్ఞాత్రిక నాగేంద్ర(ఎన్3481087), మేకపోతుల శివ(జే3481223), పలస జీవన్‌కుమార్ (జే3481262), చేపూరి శ్యాంకుమార్(జే3481299), తొనికినూరి రిషిత్‌గౌడ్(జే3481678), రేపాక హిరణ్య(ఓ3477668), పల్లె అర్చన (ఓ3478262), కామేపల్లి జెస్సీకా సాగర్(ఓ3478437), పిడమర్తి దివ్యశ్రీ (ఓ3479139), పరంగి లోహిత సాయిశ్రీ(ఓ3480943), దర్శనం దివిజ ప్రియ (ఓ3481133), కొమ్మెర లోహిత మనోశ్రీ(ఓ3481560), చింతమల్ల జస్విన్‌కుమార్(కే3481697), నెమ్మడి అశ్విని చేతన(ఓ3481751), కేతావత్ సుస్మిత (పీ3478257), కొర్ర సాత్విక నాయక్ (పీ3478426), బొడ్డుపల్లి చరణ్ (ఎల్3478454), వడ్త్య లక్ష్మీపతి బాలాజీ(ఎల్3480909), రమావత్ తేజస్విని (పీ3480979), రమావత్ సిద్దార్థ(ఎల్3481321), బానోతు సాయి ప్రణవి (పీ3481844).

తొమ్మిదో తరగతికి ఎంపికైన విద్యార్థులు వీరే..

చిలిపిరెడ్డి భవగ్ని(324589), కంపటి శ్రీహర్ష (324594), గిరి తేజశ్రీ(325029), కనుకుల హర్షిత్‌రెడ్డి(324928), చిలకరాజు చరిత (324126), రచ్చ హర్షిత (324787), మంగినపల్లి శాలిని(324865).